క్లుప్తంగా

ఘనంగా బంగారుపాపమ్మ ఉత్సవాలు

దేవరపల్లి: ఇక్కడి నుంచి బందపురం వెళ్లే రోడ్డులో కొలువైన బంగారు పాపమ్మ వారి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద అమ్మవారికి కుంకుమ పూజలు, చండీయాగం, లక్ష్మీగణపతి హోమం జరిగాయి. బందపురం, దేవరపల్లి గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు.

నేడు కొవ్వూరులో వైఎస్సార్ సీపీ సమావేశం

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మే 5న కొవ్వూరు పర్యటనకు విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని మంత్రి తానేటి వనిత క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నారు. వాస్తవంగా సోమవారం నిర్వహించాల్సిన ఈ సమావేశం వర్షం కారణంగా వాయిదా వేశామని మంత్రి తానేటి వనిత చెప్పారు. పార్టీకి చెందిన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కచ్చితంగా హాజరు కావాలని సూచించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ సన్నాహకాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్టు ఆమె తెలిపారు.

గోగులమ్మ వారి జాతర ప్రారంభం



ఊనగట్లలో అమ్మవారి గరగల ఊరేగింపు

చాగల్లు: ఊనగట్ల గ్రామదేవత శ్రీగోగులమ్మ వారి జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 21 వరకూ జాతర నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు, పంచాయతీ సర్పంచ్ మట్టా వెంకట్రావు తెలిపారు. అమ్మవారికి సోమవారం పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద, నడి వీధిలోని అమ్మవారి పూరిపాక వద్ద విద్యుద్దీపాలకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. ఈ గ్రామంలో 12 ఏళ్లకు ఒకసారి అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. జాతరలో భాగంగా సోమవారం అమ్మవారిని నడివీధిలోని పుట్టింటికి తీసుకువెళ్లారు. పొన్నులు వేసి, తొలి సేవ నిర్వహించారు. గరగలతో గ్రామంలో అమ్మవారిని ఊరేగించారు. నెల 14న అమ్మవారికి రెండో సేవ నిర్వహిస్తారు. 20న బలిచేట నిర్వహిస్తామని, 21న అమ్మవారికి గ్రామస్తులు నైవేద్యాలు సమర్పిస్తారని ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఉన్నారు.

వైభవంగా మదన గోపాలుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

నిడదవోలు: రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ మదనగోపాలస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు సోమవారం స్థానిక మదన గోపాలస్వామి వారి ఆలయంలో ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాలు శుక్రవారంతో ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయం వద్ద స్వామివారికి పంచామృతాభిషేకాలు, ధ్వజారోహణ నిర్వహించారు. రాత్రి రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఈవో నామా సూర్యప్రకాశరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధానార్చకుడు గోవర్ధన దుర్గాప్రసాద్ ఆచార్యులు, కౌన్సిలర్ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు పాల్గొన్నారు.

చరాచర సృష్టికి ఆహ్వానం.. ధ్వజారోహణం

ద్వారకాతిరుమల: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవారి బ్రహ్మోత్సవాలకు చరాచర సృష్టిని ఆహ్వానిస్తూ.. సోమవారం రాత్రి నిర్వహించిన ధ్వజారోహణ వేడుక భక్త కోటికి నేత్రపర్వమైంది. వైఖానస ఆగమోక్తంగా ఇంద్రాది అష్ట దిక్పాలకులను, భేరీ దేవతలను, గంధర్వ, కిన్నెర, కింపురుషాది దేవగణాలను, సప్త అధోలోక జీవులను స్వాగతిస్తూ.. లాంచనంగా వేద మంత్రోచ్ఛరణలతో ఆలయ ధ్వజస్తంభంపై అర్చకులు గరుడ పటాన్ని ఎగురవేశారు. అంతక ముందు రుత్విగ్వరుణ అర్చకులు పుట్టమన్నును, నవధాన్యాలను తెచ్చి ఆలయ యాగశాలలో ఏర్పాటు చేసిన పాలికల్లో శాస్త్రోక్తంగా పోసి అంకురార్పణ జరిపారు. అనంతరం చినవెంకన్న బ్రహ్మోత్సవాల వీక్షణకు సర్వదేవతలను ఆహ్వానించే దిశగా ధ్వజారోహణను నిర్వహించారు. గరుడ ప్రసాదాన్ని భక్తులకు, సంతానం లేని మహిళలకు అందించారు. రాత్రి జరగాల్సిన హంస వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ ప్రతికూల వాతావరణం కారణంగా రద్దైంది. ఆలయ ముఖ మండపంలో శ్రీవారు కాళీయ మర్దనం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాళింది మడుగులో కాళీయుడు అనే సర్ప మదాన్ని అణచే విధంగా ఉన్న ఈ అలంకారం భక్తజనులకు కనువిందు చేసింది.



పెరవలి మండలం పిట్టల వేమవరంలో తడిసిన పచ్చి ఇటుకలు



నల్లజర్ల మండలం తూర్పుచోడవరంలో అరటి తోట ఇలా..



సమిశ్రగూడెం- వేలివెన్ను రోడ్డుపై ఆరబోసిన ధాన్యం రాశులు

అన్నదాతను ముంచెత్తిన వర్షం

- పలుచోట్ల తడిసిన ధాన్యం
- ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్

నిడదవోలు రూరల్: అన్నదాతలను అకాల వర్షాలు వీడడం లేదు. నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచే ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రబీ పంటను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు నానా అవస్థలూ పడుతున్నారు. ఈదురు గాలులకు వరి చేలు నేలవాలాయి. మరికొన్ని చోట్ల వరికోత యంత్రాల ద్వారా కోసిన పంటను కాపాడుకునే ప్రయత్నాల్లో రైతులు ఉన్నారు. నిడదవోలు–నరసాపురం, సమిశ్రగూడెం – వేలివెన్నుతో పాటు పలు గ్రామాల రహదారులు, పొలంగట్లు, కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని తడవకుండా బరకాలు కప్పుకున్నారు. కొన్నిచోట్ల ధాన్యం రాశుల్లోకి వర్షపు నీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతున్నారు. మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ సమిశ్రగూడెం, డి.ముప్పవరం గ్రామాల్లో నేలవాలిన వరి చేలను పరిశీలించారు.

నేలనంటిన వరి.. తడిసిన ధాన్యపు రాశులు

పెరవలి: మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నప్పటి సోమవారం తెల్లవారుజాము ఐదు నుంచి ఉదయం 10 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీసింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రబీ వరి చేలు నేలనంటాయి. కళ్లాల్లోని ధాన్యపు రాశులు తడిచి ముద్దవడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. తడిచిన ధాన్యపు రాశులను, బస్తాల్లో పట్టిన ధాన్యాన్ని ఆరబెడదామంటే సోమవారం పగలంతా ఎండ రాలేదు. దాంతో తడిసిన ధాన్యం ఏమైపోతుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించదని, కొనేందుకు కూడా వ్యాపారులు ముందుకు రాకపోవచ్చని సందేహం వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 35,500 ఎకరాల్లో ఈ ఏడాది రబీ సాగు చేయగా ఇప్పటి 40 శాతం విస్తీర్ణంలోని వరి కోతలు పూర్తయ్యాయి. అందులో సగానికి పైగా ధాన్యం ఒబ్బిడి అయ్యింది. ప్రస్తుతం ఉన్న 60 శాతం వరి చేలు, ధాన్యం రాశులు, ధాన్యం బస్తాలు తడిసిపోయాయని రైతులు చెబుతున్నారు.ఇక పెరవలి మండలంలో 8,500 ఎకరాల విస్తీర్ణంలో రబీ సాగు చేశారు. కానూరు, ఉసులుమర్రు, తీపర్రు గ్రామాల్లో జోరుగా మాసూళ్లు సాగుతున్న దశలో అకాల వర్షం దెబ్బతీసింది. అలాగే ఈదురు గాలులకు అరటి తోటలు నిలువునా విరిపోయాయి. మండలంలో వరి తర్వాత అత్యధిక సాగు అరటి పంటే. గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న అరటి రైతులను ఈ అకాల వర్షాలు, ఈదురు గాలులు పూర్తిగా దెబ్బతీశాయి.భారీ వర్షాలకు కళ్లాల్లో ఉన్న పచ్చి ఇటుకలు తడిసిపోయాయి.రూ.లక్షల్లో బట్టీల నిర్వాహకులకు నష్టం వాటిల్లింది. మండలంలో 80 వరకూ ఇటు బట్టీలు ఉన్నాయి.

చాగల్లు: మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణ శాఖ అధికారుల ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో వారు తమ పంట ఒబ్బిడి చేసుకునే పనిలోను, ధాన్యాన్ని మిల్లులకు తరలించే పనిలోనూ నిమగ్నం అయ్యారు. చాలామంది రైతులు ధాన్యాన్ని రోడ్ల పైన, కళ్లాలపై ఎక్కడ జాగా దొరికితే అక్కడ ఆరబెట్టుకుని కాపలా కాస్తున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి మండలంలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వర్షం రాకపోవడంతో ఎస్. ముప్పవరం, ఊనగట్ల, చాగల్లు ప్రాంతాల్లోని కొందరు రైతులు రోడ్లపై ఆరబోసుకున్న ధాన్యాన్ని బస్తాల్లో నింపి భద్రపరుచుకున్నారు. ధాన్యం తరలింపును అధికారులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.



నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో నేలవాలిన వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ సత్యనారాయణ

ఉద్యాన పంటలకు నష్టం

నల్లజర్ల: అకాల వర్షానికి ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న పంట తడిసిపోయాయి. ఉద్యాన సాగుకు నష్టం వాటిల్లింది. మండలంలోని తూర్పు చోడవరంలో కోలా ఏడుకొండలుకు చెందిన ఏడెకరాల్లోని మొక్కజొన్న పంట వర్షం నీటిలో తడిసిపోయింది. పెండ్యాల చందు అనే రైతులకు చెందిన కోతకు వచ్చిన అరటి తోట నేల వాలింది. నిమ్మ, కూరగాయల పందిళ్లు నేలకూలాయి. ఒక్క తూర్పు చోడవరంలోనే ఆరున్నర ఎకరాల్లోని అరటి, రెండెకరాల్లోని నిమ్మ, ఎకరం విస్తీర్ణంలోని కూరగాయల పందిరి నేలకూలినట్టు రైతులు వివరించారు. పంటను కోయడం ఒక ఎత్తయితే, దానిని ఒబ్బిడి చేసుకోవడం మరో ఎత్తయిందని రైతులు వాపోతున్నారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయడంతో పాటు నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సోమవారం తెల్లవారుజామున వీచిన ఈదురు గాలులకు అక్కడక్కడా మామిడి చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పంట నేల రాలింది. ఆన్‌లైన్‌లో రైతు పేరు రావడం ఆలస్యమైతే ఆఫ్‌లైన్‌లోనూ ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్టు ఏఓ కమల్‌రాజ్ తెలిపారు. ధాన్యంలో నూక శాతాన్ని పరీక్షించేందుకు నల్లజర్లలో మినీ రైస్ మిల్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

దేవరపల్లిలో 42.2 మిల్లీ మీటర్ల వర్షపాతం

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో సోమవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారు జామున 4 నుంచి ఉదయం 10 గంటల వరకూ ఏకధాటిగా వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండు వేసవిలో వర్షాలు కురవడం వల్ల పంటలు దెబ్బతిన్నాయని వారు పేర్కొంటున్నారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యపు రాశుల కింది భాగం వర్షపు నీటికి తడిసినట్టు రైతులు తెలిపారు. అధికారుల ముందస్తు సూచన మేరకు ధాన్యం రాశులపై బరకాలు కప్పి ఒబ్బిడి చేయడం వల్ల చాలా వరకూ పటను కాపాడుకున్నట్టు రైతులు తెలిపారు. బస్తాల్లో పట్టిన ధాన్యాన్ని తక్షణం మిల్లులకు పంపించి దిగుమతి చేస్తే ఇబ్బంది ఉండదన్నారు. అలాగే రోడ్లపైన, కళ్లాల్లోను ఆరబెట్టిన మొక్కజొన్నలు భారీ వర్షానికి తడిసిపోయాయి. మొక్కజొన్న కంకులు నీటిలో ఉన్నాయని రైతులు తెలిపారు. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో మొక్కజొన్నలు రోడ్లపై ఆరబెట్టి ఉన్నాయి. దేవరపల్లిలో 42.2, గోపాలపురంలో 24.6, నల్లజర్లలో 39.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దేవరపల్లిలో అత్యధికంగా వర్షపాతం నమోదు అయింది.



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో తడిసిన మొక్కజొన్న



పెరవలి మండలం పిట్టల వేమవరంలో నేలనంటిన వరి చేను



చాగల్లు మండలం ఎస్. ముప్పవరంలో ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న కూలీలు

శ్మశానవాటికల కోసం దళితుల ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత నాయకులు

పెరవలి: శ్మశానవాటికల స్థలాలు సమకూర్చాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల దళితులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. దళిత సంఘాలు, బీఎస్పీ నాయకుల ఆధ్వర్యంలో ఈ ఆందోళన సాగింది. అనంతరం వారు స్థానిక తహసీల్దార్ టి.రాజరాజేశ్వరికి ఈ మేరకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉసులుమర్రు, తీపర్రు, ఖండవల్లి, అజ్జరం, పెరవలి గ్రామాల్లో దళితులకు శ్మశానవాటికలు లేవన్నారు. వరదల సమయంలో ఏటిగట్టు పక్కనే మృతదేహాలను పూడ్చవలసి వస్తోందని వివరించారు. గ్రామాల్లో ఆక్రమణల నుంచి శ్మశానవాటికలు విడిపించి, తమకు అప్పగించాలని దళితులు కోరారు. కార్యక్రమంలో బద్దా జాన్, గుమ్మాపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా మేడే వేడుకలు

- సీఐటీయూ సహా పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ
- పలుచోట్ల పతాకావిష్కరణలు, ర్యాలీలు

కొవ్వూరు: పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మే డే వేడుకలను పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పుంతలో ముసలమ్మ గుడి వద్ద పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్దిరెడ్డి బాపిరాజు, కొవ్వూరమ్మ గుడి వద్ద చిలక మురళి, చైతన్య తాపీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద మైగాపుల నాగేశ్వరరావు సీఐటీయూ పతాకాలు ఆవిష్కరించారు. ఐ.పంగిడిలో కార్మిక సంఘాల సమాఖ్య, క్రషర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ప్రగతి శీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్, క్రషర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గంటా కృష్ణ, కందుల దుర్గారావు, చిక్కాల నాగరాజు ఆధ్వర్యంలో ఐ.పంగిడి సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు.

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు, గౌరీపట్నం, బందపురం, దేవరపల్లి గ్రామాల్లో కార్మిక సంఘాల పతాకాలను నాయకులు ఆవిష్కరించారు. ప్రగతి శీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో దుద్దుకూరు, గౌరీపట్నంలలో కార్మికులు మేడే వేడుకలు నిర్వహించారు. సీపీఎం, సీఐటీయూ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో దేవరపల్లిలో మేడు వేడుకలు జరిపారు. సీపీఎం జిల్లా నాయకుడు ఉండవల్లి కృష్ణారావు, యూటీఎఫ్ నాయకుడు బండి సూర్యప్రకాశరావు, కార్మికులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: సీఐటీయూ, వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తాళ్లపూడి బస్టాండ్ వద్ద పతాకావిష్కరణ చేశారు. భవన నిర్మాణ, అంగన్‌వాడీ సంఘాలు, ఏపీటీఎఫ్ నాయకులు దూడల గోపాలరావు, వై.నరసింహమూర్తి, ఉప్పే కేదార్ పాల్గొన్నారు. అలాగే వేగేశ్వరపురం, అన్నదేవరపేట ఇందిరమ్మ కాలనీ, మలకపల్లి, పెద్దేవం గ్రామాల్లో మేడే వేడుకలు నిర్వహించారు.

చాగల్లు: సీఐటీయూ, సీపీఎం, విజయదుర్గా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చాగల్లు ప్రధాన కూడలి అంతా అరుణ పతాకాలతో అలంకరించారు. మీనానగరంలోని ఎల్ఎంఎల్ డిపో వద్ద, ఊనగట్ల సివిల్ సప్లయి గోదాము వద్ద కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు.

నల్లజర్ల: మండలంలోని పోతవరం, నల్లజర్ల, దూబచర్ల, చోడవరం, తెలికిచెర్ల, ఆవపాడులలో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ సంస్థ మండల కార్యదర్శి బొంగు వీరభద్రం, సీనియర్ నాయకుడు రాగోలు శ్రీనివాస్‌లు కార్మిక దినోత్సవం గురించి వివరించారు. అలాగే యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మనోహరకుమార్ నల్లజర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో పతాకావిష్కరణ చేశారు.

నిడదవోలు రూరల్: ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రేఖ భాస్కరరావు ఆధ్వర్యంలో పలువురు కార్మికులు, నాయకులు పట్టణ వీధుల్లో భారీ ర్యాలీ చేశారు.పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా సీపీఎం నిడదవోలు కార్యాలయంలోని ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు.

పెరవలి: మండలంలోని భవన నిర్మాణ, కొబ్బరి ఒలుపు, దింపు, ఎలక్ట్రికల్, ప్లంబర్, వివిధ ఫ్యాక్టరీల కార్మికులు ఘనంగా మేడే వేడుకలు జరుపుకున్నారు. సీపీఐ ఆధ్వర్యంలో అన్నవరప్పాడు, ఖండవల్లి, ముక్కామల, కాకరపర్రు, మల్లేశ్వరం, తీపర్రు గ్రామాల్లోను, అలాగే సీపీఎం ఆధ్వర్యంలో కొత్తపల్లి, పెరవలి, అజ్జరం గ్రామాల్లో మేడే ఉత్సవాలు జరిగాయి. సీపీఐ మండల కార్యదర్శి డీపీఎస్ హనుమంతరావు సొసైటీ అధ్యక్షుడు పంతం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు మండలం ఐ.పంగిడిలో ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



పెరవలి మండలం ముక్కామలలో..

కమనీయం.. వేంకటేశుని కల్యాణం



అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం



వెలగదుర్రులో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పెరవలి: వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము 4 గంటలకు స్వామివారి సుప్రభాతసేవ, నిత్యార్చన అలంకరణ అనంతరం భక్తుల సర్వదర్శనానికి అనుమతించారు. శ్రీరామ పట్టాభిషేక వేదికపై అఖండ శ్రీరామనామ సంకీర్తన ప్రారంభించారు. మధ్యాహ్నం స్వామివారికి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. పంతం ఆదినారాయణ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద పండితులు సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా భక్తాంజనేయ కోలాట భజన బృందం ఆలయ ప్రాంగణంలో కోలాటాన్ని ప్రదర్శించారు. స్వామివారి భక్తి గీతాలు ఆలపిస్తూ చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

వెలగదుర్రులో..

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రులో కొలువైన భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాన్ని సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితులు బ్రహ్మశ్రీ వేదుల వెంకటరమణ మూర్తి, శ్రీనివాసులు, త్రినాథ్‌లు శాస్త్రోక్తంగా స్వామివారికి కల్యాణ క్రతువు నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకాలు, పూజలు, ఆలంకరణ చేశారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు కల్యాణాన్ని తిలకించి, స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

కనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం



ఐ. పంగిడిలో కలశాలతో మహిళల ఊరేగింపు

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామంలో కనక దుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వందలాది మహిళలు కలశాలతో గ్రామ ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. శక్తి వేషాలు, మేళతాళాలతో ఊరేగింపు సందడిగా సాగింది. రూ.1.50 కోట్ల వ్యయంతో ఈ గ్రామంలో కనకదుర్గా అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ఉప్పులూరి వెంకట ఫణి కృష్ణారావు, ఉప్పులూరి రమేష్, వారి కుటుంబ సభ్యుల సహకారం, కొంత మేర దాత సహకారంతో ఈ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు గణపతి పూజ, యాగశాల ప్రవేశం, మండపారాధన, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన నిర్వహించారు.

కారు ఢీ కొని రైతుకు గాయాలు

కొవ్వూరు: పొలానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న ఓ రైతు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కుమారదేవం గ్రామంలోని పాతూరు రేవు వద్ద ఆదివారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన ఉప్పులూరి వెంకట కృష్ణారావు అనే రైతు తన పొలానికి వెళ్లి బైక్‌పై ఇంటికి తిరిగి వస్తూ పాతూరు రేవు వద్ద కొద్దిసేపు ఆగాడు. ఇంతలో వేగంగా వస్తున్న కారు ఆయనను ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన కృష్ణారావును రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు.